Sakshi 01- 31/07/15

సాక్షి | హైదరాబాద్ | శుక్రవారం | జూలై | 31 | 2015

# ఆకాశవంతెనలతో అనుసంధానం

- మెట్రో, సికింద్రాబాద్ స్టేషన్లతో లింక్
- ఓల్డ్ గాంధీ ఆస్పత్రి వద్ద మెట్రోకు లైన్ క్లియర్
- పనులు పరిశీలించిన మంత్రి తలసాని



మెట్రో పనులను పరిశీలిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, హెచ్‌ఎంఆర్ ఎమ్‌డీ ఎన్వీఎస్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో:

సికింద్రాబాద్ వెస్ట్, ఈస్ట్ మెట్రో రైలు స్టేషన్ల నుంచి ప్రధాన రైల్వే స్టేషన్‌ను ఆకాశ వంతెన (స్కైవాక్)లతో అనుసంధానించనున్నట్లు హైదరాబాద్ మెట్రో రైలు మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. ఈ వంతెనల మీదుగా ప్రధాన రైల్వే స్టేషన్‌లోని అన్ని ప్లాట్‌ఫారాలకు చేరుకునే అవకాశం ఉంటుందన్నారు. గురువారం వాణిజ్య పన్నుల శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి వెస్ట్ మెట్రో రైల్వే స్టేషన్ నిర్మాణ పనులతో పాటు, ఓల్డ్ గాంధీ ఆస్పత్రి, బోయిగూడ-కాచిగూడ జంక్షన్‌లలో మెట్రో పనుల ప్రగతిని పరిశీలించారు. ఓల్డ్ గాంధీ ఆస్పత్రి వద్దనున్న 1.65 ఎకరాల స్థలంలో సైనిక్ ఆరాంఘర్ నిర్మించనున్నట్లు మంత్రికి వివరించారు. ఇదే ప్రాంతంలో స్థానిక సాంబమూర్తి నగర్ బస్తీ వాసులు నాగదేవతకు పూజలు నిర్వహించుకునేందుకు వీలుగా 35 చదరపు గజాల స్థలాన్ని విడిచిపెడుతున్నామన్నారు. ఓల్డ్ గాంధీ ఆస్పత్రి ప్రాంగణాన్ని అంతర్జాతీయ ప్రమాణాలున్న ట్రాన్స్‌పోర్ట్ హబ్‌గా హెచ్‌ఎంఆర్ సంస్థ అభివృద్ధి చేయనుందన్నారు. అనంతరం హెచ్‌ఎంఆర్, ఎల్‌అండ్‌టీ ఇంజినీర్లతో కలిసి బోయిగూడ నుంచి కాచిగూడ జంక్షన్ వరకు 8 కి.మీ. మార్గంలో (కారిడార్-2) జరుగుతున్న మెట్రో పనులను నడుచుకుంటూనే వెళ్లి తనిఖీ చేశారు. ఈ మార్గంలో పనులు వేగవంతానికి వీలుగా డ్రైనేజీలను, విద్యుత్ స్తంభాలను తక్షణం పక్కకు తప్పించాలని అధికారులను ఆదేశించారు. ముషీరాబాద్-కాచిగూడ మార్గంలో దెబ్బతిన్న రహదారులను బీటీ, సీసీగా తీర్చిదిద్దుతామన్నారు.

**ఆకాశవంతెనలు ఇలా..**

సికింద్రాబాద్ ప్రాంతంలో నిర్మించనున్న వెస్ట్ మెట్రో రైలు స్టేషన్ నుంచి 200 మీటర్ల దూరంలో ఉన్న ప్రధాన రైల్వే స్టేషన్‌ను ఆకాశ వంతెనతో అనుసంధానించనున్నారు. మరోవైపు ఈస్ట్ మెట్రో రైలు స్టేషన్ నుంచి కిలోమీటరు దూరంలో ఉన్న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు కూడా ఆకాశ వంతెనలు ఏర్పాటు చేస్తారు. వీటి మీదుగా ప్రధాన రైల్వే స్టేషన్‌లోని అన్ని ప్లాట్‌ఫారాలపైకి చేరుకునేలా ఏర్పాట్లు చేయనున్నట్లు హెచ్‌ఎంఆర్ ఎమ్‌డీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. మెట్రో రైలు స్టేషన్లను ఎంఎంటీఎస్ స్టేషన్లు, ఆర్టీసీ బస్టాపులు, ప్రధాన రైల్వే స్టేషన్‌తో అనుసంధానిస్తామన్నారు.